తెలుగు దినపత్రిక

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్త పత్రిక

15-07-2026

బుధవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 157

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575


# తెలంగాణ రహదారి ప్రాజెక్టులకు వేగం పెంచాలి: రేవంత్ రెడ్డి

- నితిన్ గడ్కరీతో ముఖ్యమంత్రి కీలక భేటీ
- ఆర్ఆర్ఆర్, గ్రీన్‌ఫీల్డ్ రహదారులకు అనుమతుల కోరింపు
- హైదరాబాద్–అమరావతి, మంచిర్యాల మార్గాలపై ప్రతిపాదనలు
- ప్రతిపాదనలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి హామీ

**న్యూఢిల్లీ, జూలై 14, సిరి న్యూస్**

"తెలంగాణలో కీలక రహదారి ప్రాజెక్టులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలి. ప్రాంతీయ వలయ రహదారితో పాటు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారుల నిర్మాణం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కీలకం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని

మిగతా 2వ పేజీలో..

## ప్రపంచస్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాలు

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2





# మోడీ-షా చాణక్య రాజనీతి ఫలించేనా?!

- మహిళా బిల్లు, డీలిమిటేషన్, జమిలి ఎన్నికలే టార్గెట్
- ఢిల్లీ వేదికగా కేంద్రం సన్నద్ధం
- పార్లమెంట్ సమావేశాలపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ
- ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ కోసం చట్ట సవరణలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

3

# ఓల్డ్ బోయిన్‌పల్లి.. అక్రమ నిర్మాణాల సామ్రాజ్యం !

- ప్రైవేట్ వ్యక్తుల గుప్పిట్లో టౌన్ ప్లానింగ్
- అడుగడుగునా అక్రమాలు..
- దూరంగా చర్యలు
- అధికారుల కోసం వెళ్తే సాకులే సమాధానాలు
- ప్రైవేట్ వ్యక్తుల అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- అవినీతికూపంలో బందీ అయిన అధికారగణం
- ఏసీబీ అధికారులు నిఘా పెట్టాలని స్థానికుల డిమాండ్



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 14 (సిరిన్యూస్):**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ బోయినపల్లి టౌన్ ప్లానింగ్ సర్కిల్ 3లో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలే విచ్చలవిడిగా దర్శనమిస్తున్నాయి. కానీ ఇప్పటివరకు టౌన్ ప్లానింగ్ అధికారులు వీటి వైపు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవు. ఒక్క అక్రమ కట్టడంపైనా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. దీంతో ఈ సర్కిల్‌లో అసలు అధికార యంత్రాంగం అనేది ఉందా, లేదా అనే ప్రశ్న ప్రజల నుంచి వెల్లువెత్తుతోంది.. ఓల్డ్ బోయినపల్లి, హస్మత్‌పేట్, ఫతేనగర్, ప్రకాష్‌నగర్, బేగంపేట్ తదితర ఐదు డివిజన్లు కలిగిన ఓల్డ్ బోయిన్ పల్లి 3 సర్కిల్‌లో రోడ్డుకు ఇరువైపులా గల్లీల్లో, ఖాళీ

మిగతా 3వ పేజీలో..

# సింగరేణిని మరింత బలోపేతం చేస్తాం

- గత ప్రభుత్వాలవల్ల సింగరేణి కార్మికుల్లో పెరిగిన అభద్రత
- సింగరేణి లైఫ్ లైన్ తాడిచెర్ల బ్లాక్ 2 బొగ్గు గని
- కేటీకే8 గనిలో సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2





## ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించుకోవాలి

- ఎల్‌నినో దృష్ట్యా రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల సూచన

2

## హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్‌పై ఏసీబీ పంజా

- రూ. 100 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు.. రవీందర్ అరెస్ట్
- హైదరాబాద్, నిజామాబాద్‌లలో 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు



3



## ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

- బీఆర్ఎస్ దోపిడీ వల్లే రూ.8.21 లక్షల కోట్ల అప్పుల భారం
- రెండున్నరేళ్లలోనే రూ.2.08 లక్షల కోట్ల అసలు, వడ్డీలు చెల్లించాం
- అప్పులు కడుతూనే అదనపు సంక్షేమ పథకాల అమలు
- మల్లమ్మకుంట భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు
- రైతులను ఇబ్బంది పెట్టం.. సరైన పరిహారం అందిస్తాం
- జులేకల్ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

3



2

## ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి త్వరగా ఇవ్వండి

# కీలక బిల్లులపై కేంద్రం దృష్టి

- ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదం పొందేలా ఎన్డీఏ కసరత్తు
- మహిళా రిజర్వేషన్ అమలుకు వేగవంతమైన చర్యలు
- డీలిమిటేషన్, జమిలి ఎన్నికల ప్రతిపాదనలకు ప్రాధాన్యం
- ఎన్నికల సంస్కరణలు, వక్ఫ్ చట్ట సవరణపై దృష్టి

2



## మహిళా సాధికారత సమాజ భద్రతకు బలమైన పునాది

- మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి

**మేడ్చల్, జూలై 14, సిరి న్యూస్:**

మహిళల సాధికారత సమాజ భద్రతకు బలమైన పునాది అని, సమాజంలో మహిళల భద్రతను కేవలం చట్టపరమైన అంశంగా కాకుండా,

మిగతా 3వ పేజీలో..



# తెలంగాణ రహదారి ప్రాజెక్టులకు వేగం పెంచాలి: రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి**



కోరారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు జాతీయ రహదారి ప్రాజెక్టులపై ఇద్దరూ విస్తృతంగా చర్చించారు.

**ఆర్ఆర్ఆర్‌కు ప్రాధాన్యం**

ప్రాంతీయ వలయ రహదారి ఉత్తర భాగానికి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయిందని ముఖ్యమంత్రి తెలిపారు. కేంద్ర మంత్రిమండలి నుంచి త్వరగా అనుమతులు మంజూరు చేసి ఉత్తర, దక్షిణ భాగాల్లో ఒకేసారి పనులు ప్రారంభిస్తే నిర్మాణం వేగంగా పూర్తికావడంతో పాటు వ్యయం కూడా తగ్గుతుందని వివరించారు.

**కొత్త రహదారుల ప్రతిపాదనలు**


హైదరాబాద్ నుంచి అమరావతి వరకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి అనుమతి ఇవ్వాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అలాగే భవిష్యత్ నగరం నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 వరుసల జాతీయ రహదారిని మంజూరు చేయాలని కోరారు. ఈ మార్గం అందుబాటులోకి వస్తే హైదరాబాద్-విజయవాడ మధ్య దూరం సుమారు 100 కిలోమీటర్లు తగ్గడంతో పాటు సరుకు రవాణా మరింత వేగవంతం అవుతుందని వివరించారు.

**ఇతర ప్రాజెక్టులపై వినతి**

మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అవసరమైన అటవీ శాఖ అనుమతులు త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్-మంచిర్యాల మధ్య ప్రస్తుతం ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఆరు వరుసల కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హామీ ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

# ప్రపంచస్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాలు

- ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ ఎయిర్‌పోర్టు
- ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణ చేపడతాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**ఢిల్లీ, జూలై 14, సిరి న్యూస్:**

రాష్ట్రంలో నిర్మించనున్న వరంగల్(మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు. కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ విమానాశ్రయ పనులపై సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతోపాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలతో వరంగల్ కీలక నగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రికి తెలియజేశారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతోపాటు నల్గొండ జిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028 జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్టు పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్‌పోర్టుతోపాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని విజ్ఞప్తి చేస్తూ రెండింటికి అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలు (ఎఫ్‌టీవో) నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి విన్నవించగా ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి సూచించారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ మురళీధర్ మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు : రేవంత్ రెడ్డి**

అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకు సహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీకి వస్తున్నామని, దానిపైనా రాజకీయంగా విమర్శలు చేయడం తగదని సీఎం హితవు పలికారు.

**తెలంగాణ మాదిరే ఇతర రాష్ట్రాలూ స్పందించాలి : రామ్మోహన్ నాయుడు**

విమానాశ్రయాలతోనే అనేక దేశాలు అభివృద్ధి చెందాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్రాలు పోటీపడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనంత త్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్ర సృష్టించిందని అభినందించారు. ఇంత త్వరగా స్పందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. భూసేకరణ, ఇతర అంశాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ మాదిరే స్పందించాలని కేంద్రం మంత్రి సూచించారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలా విమానాశ్రయ డిజైన్ ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

**ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి**

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుతుందని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి దుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్ విజయవాడల మధ్య 100 కిలోటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్ధరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూసేకరణ తాము చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.



# సింగరేణిని మరింత బలోపేతం చేస్తాం

**జయశంకర్ భూపాలపల్లి, సిరి న్యూస్ :**

గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాల వల్ల సింగరేణి కార్మికులలో అభద్రత, ఆందోళన పెరిగిపోయిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆరోపించారు. జిల్లాలోని సింగరేణి కేటీకే 8 , తాడిచెర్ల బ్లాక్ 2 గనులలో సింగరేణి భరోసా యాత్రలో భాగంగా బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అప్పని శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించగా మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా దేశ అభివృద్ధికి ఇంధనంగా నిలుస్తున్న సింగరేణి కార్మికుల కృషి దేశానికి ఎంతో విలువైనదని కొనియాడారు. సింగరేణిని దేశంలోనే అత్యంత కీలకమైన ప్రభుత్వరంగ సంస్థగా బలోపేతం చేయాల్సిన గత ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్(డిఎంఎఫ్) నిధుల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జెన్‌కో సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.9,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ బకాయిల కారణంగా సంస్థపై అనవసర ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో నామినేషన్ విధానంలో తాడిచెర్ల 2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడంతో సింగరేణి లైఫ్ లైన్ తాడిచెర్ల బ్లాక్ 2 బొగ్గు గల్లీగా మారిందని అన్నారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, తెలంగాణ అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిని మరింత బలోపేతం చేసి,పారదర్శక పాలనతో కార్మికుల సంక్షేమాన్ని కాపాడుతూ సంస్థను తిరిగి లాభాల బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. రామచంద్రరావు మాట్లాడుతూ సింగరేణి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని చెప్పారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధి కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. సింగరేణి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని, కార్మికుల ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నీ బీజేపీ సహించదని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, బీజేపీ రాష్ట్ర, కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, బీఎంఎస్ నాయకులు, సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాలు పూరించి త్వరగా ఇవ్వండి

- ఓటర్లకు సీఈవో సుదర్శన్ రెడ్డి సూచన

**హైదరాబాద్, జూలై 14 , సిరి న్యూస్:**

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఎసఐఆర్ కార్యక్రమంలో భాగంగా తీసుకున్న ఎన్యూరేషన్ ఫారాలను పూర్తి చేసి బీఎల్‌వోలకు వెంటనే అందజేసి మీ అమూల్యమైన ఓటు హక్కును కాపాడుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఓ ప్రకటనలో ఓటర్లకు పిలుపునిచ్చారు. ఎలాంటి తప్పులు లేకుండా ఫారాలు పూరించి పాస్‌పోర్టు సైజ్ ఫొటో అతికించి బీఎల్‌వోలకు అందజేయాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారంలో తప్పనిసరిగా ఓటరు సంతకం, తేదీతోపాటు బీఎల్‌వోల సంతకం ఉండేలా చూసుకోవాలన్నారు. అందజేసిన రెండు ఎన్యూమరేషన్ ఫారాల్లో ఒకటి బీఎల్‌వోలకు ఇవ్వాలని, మరొకటి ఓటరు Y భద్రపరుచుకోవాలని సూచించారు. పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు ఇస్తేనే డ్రాఫ్ట్ ఓటర్ జాబితాలో పేరు నమోదు అవుతుందని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో ఓటరు వివరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా నింపాలని, ఒకవేళ అలాంటి వివరాలు లేకపోయినా ప్రస్తుత వివరాలతో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి బీఎల్‌వోలకు అందజేయాలని తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 3,38,26,448మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,66,70,610మంది (49.28%) తమ ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించారన్నారు. 'సర్' ప్రక్రియ మరో పది రోజుల్లో ముగుస్తుందన్నారు.

# కీలక బిల్లులపై కేంద్రం దృష్టి

**న్యూఢిల్లీ, జూలై 14, సిరి న్యూస్**



రానున్న పార్లమెంట్ సమావేశాల్లో కీలక బిల్లులను ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మహిళా రిజర్వేషన్ అమలు, నియోజకవర్గాల పునర్విభజన, జమిలి ఎన్నికలు, ఎన్నికల సంస్కరణలు, వక్ఫ్ చట్ట సవరణ వంటి అంశాలకు ఈ సమావేశాల్లో అధిక ప్రాధాన్యం లభించే అవకాశం ఉందని తెలుస్తోంది. వీలైనంత వరకు ఈ బిల్లులను పార్లమెంట్ ఆమోదం పొందేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

**మహిళా రిజర్వేషన్, జమిలిపై కసరత్తు**

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కోసం అవసరమైన డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేసే దిశగా కేంద్రం చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజన అనంతరం మహిళా రిజర్వేషన్ అమలుకు మార్గం సుగమం చేయాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే జమిలి ఎన్నికల ప్రతిపాదనపై కూడా ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల ఆధారంగా ముందుకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ఎన్నికల సంస్కరణలకు ప్రాధాన్యం**

ప్రజాప్రాతినిధ్య చట్టంలో పలు మార్పులు తీసుకురావడంపై కూడా కేంద్రం దృష్టి సారించినట్లు సమాచారం. ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థంగా మార్చే లక్ష్యంతో కొన్ని కీలక ప్రతిపాదనలను పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ అంశాలపై అధికారికంగా బిల్లులు సభలో ప్రవేశపెట్టిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**వక్ఫ్ చట్టంలో మార్పులు**

వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు సంబంధించిన బిల్లును కూడా ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో పారదర్శకత పెంపు, డిజిటలైజేషన్, పరిపాలనా సంస్కరణలు, మహిళల ప్రాతినిధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం కల్పించే ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**రాజకీయంగా కీలక సమావేశాలు**

ఈ బిల్లులపై అధికార, ప్రతిపక్షాల మధ్య విస్తృత చర్చ జరిగే అవకాశం ఉంది. వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయాలు, పార్లమెంటరీ కమిటీల సిఫార్సులు, సభలో జరిగే చర్చల అనంతరం తుది నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండటంతో ఈ పార్లమెంట్ సమావేశాలు దేశ రాజకీయాల్లో కీలక మలుపుగా మారనున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించుకోవాలి

**హైదరాబాద్, జూలై 14, సిరి న్యూస్ :**

రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతుందని, కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందని, అందుకనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన సూచనలు చేశారు. వ్యవసాయ, నీటిపారుదల, భూగర్భ జ□, భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అధికారులు సమన్వయంతో భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని, శాస్త్రవేత్తలు సూచించినట్లు తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. ఐఎండీ హైదరాబాద్ సంచాలకురాలు స్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరు.ల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె.సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకుడు బి.గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకుగు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్తాస్ జానయ్య, ఇరిగేషన్ ఇంజినీర్‌ఇన్‌చీఫ్ మధుసూదన్ రావు, భూగర్భ జలాల శాఖ సంచాలకుడు లక్ష్మణ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భారత నూనెగింజల



పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సురేష్, మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి.రావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొన్నారు. ఆయా రంగాలకు సంబంధించిన నిపుణులు రైతులకు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు

**వడ్డేపల్లి, జూలై 14, సిరి న్యూస్:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని నిలువునా దోపిడీ చేసి రూ.8 లక్షల 21 వేల కోట్ల అపారమైన అప్పుల ఊబిలోకి నెట్టేసిందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అలంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం జులేకల్ గ్రామంలో ఏఐసీసీ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్సీ సంపత్ కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. నాడు తాము రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌తో, ధనిక రాష్ట్రంగా అప్పగిస్తే గత పాలకుల పదేళ్ల అనాలోచిత నిర్ణయాలు, అవినీతి వల్ల తెలంగాణ అప్పులకుప్పగా మారిందని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆర్థిక భారం పడిందని డిప్యూటీ సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్ల కాలంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన అప్పులకు సంబంధించి రూ.2 లక్షల 8 వేల కోట్ల అసలు, వడ్డీలను బ్యాంకులకు చెల్లించాల్సి వచ్చిందని వెల్లడించారు. ఆ నిధులను ఏం చేశారయ్యా అంటే రాష్ట్రంపై పడి దోపిడీ చేశారు తప్ప రాష్ట్ర ప్రజలకు పైసా మేలు చేయలేదని విమర్శించారు. ఇంత ఆర్థిక సంక్షోభంలోనూ తాము ప్రతినెలా రూపాయి రూపాయి పోగేస్తూ పాత అప్పులు కడుతూనే సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నాం అని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆ ప్రభుత్వం ప్రారంభించిన షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి వంటి పథకాలను కొనసాగిస్తున్నామని, వీటితోపాటు అదనంగా అనేక విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వం ప్రతినెలా ఉద్యోగులకు సకాలంలో జీతాలు, రైతులకు ఉచిత కరెంట్ ఇస్తోందని, మహిళల ఉచిత ప్రయాణానికి రూ.12 వేల కోట్లను ఆర్టీసీకి చెల్లించిందని వివరించారు. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, అంతర్జాతీయ ప్రమాణాలతో వంద ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగిజావతో కూడిన ఉదయం అల్పాహారం వంటి విప్లవాత్మక మార్పులు తెచ్చామని చెప్పారు. రాబోయే నవంబర్‌లో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించబోతున్నామని ప్రకటించారు.

**మళ్లీ వచ్చి ఏం బంద్ చేస్తారు?**

పదేళ్లపాటు రాష్ట్రాన్ని నిలువునా దోపిడీ చేసి ప్రజలను తాకట్టు పెట్టిన వారు ఇప్పుడు మళ్లీ వస్తున్నామంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మళ్లీ అధికారంలోకి వచ్చి ఏం చేస్తారు? పేదలకు ఇచ్చే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కట్ చేస్తారా.. ప్రతి కుటుంబానికి ఇస్తున్న సన్న బియ్యాన్ని ఆపేస్తారా.. కోటి 15 లక్షల కుటుంబాలకు రక్షణగా నిలిచే రూ.5 లక్షల ఇందిరమ్మ బీమాను రద్దు చేస్తారా.. లేక మహిళల ఉచిత బస్సు ప్రయాణాన్ని, డ్వాక్రా మహిళలకు అందిస్తున్న రూ.76 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను బంద్ చేస్తారా అని బీఆరఎస్ నాయకులను ప్రశ్నించారు.

**మల్లమ్మకుంట భూసేకరణకు ఆదేశిస్తాం**

పాలమూరు జిల్లా వలసల నివారణకు, వెనుకబడిన ప్రాంతాల సాగునీటి అవసరాలు తీర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నార్లాపూర్ నుంచి ఉద్దండాపూర్ వరకు పెండింగ్ పనులను వేగవంతం చేశామని, భూసేకరణ నిధులన్నింటినీ క్లియర్ చేశామని చెప్పారు. ఆర్డీఎస్ పరిధిలోని తుమ్మిళ్ల ప్రాజెక్టులో భాగంగా మల్లమ్మకుంట రిజర్వాయర్ నింపడానికి అవసరమైన 573 ఎకరాల భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఈ రోజే ఆదేశించనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 87,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని భరోసా ఇచ్చారు. భూమితో రైతుకు ఉండే భావోద్వేగ బంధం తమ ప్రభుత్వానికి బాగా తెలుసని భట్టి విక్రమార్క అన్నారు. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా, తక్కువ ధర నిర్ణయించి ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు. ఈ సభలో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, స్థానిక పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి మాట్లాడారు. కాగా, వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఏఐసీసీ సెక్రటరీ సంపత్, చిక్కుడు వంశీకృష్ణ, షాద్‌నగర్ ఎమ్మెల్యే పీర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్లు సరిత, గట్టు తిమ్మప్ప, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నర్సింగరావు స్వాగతం పలికారు.

**నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాయే ధ్యేయం : భట్టి**

**– జిల్లాలో రూ.376.25 కోట్ల విలువైన సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవాలు**

ఎర్రవల్లి : నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాయే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యుత్ ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉప కేంద్రాలను మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్లతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లావ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్, అచ్చంపేట, షాద్‌నగర్, జడ్చర్ల ఎమ్మెల్యేలు విజయుడు, చిక్కుడు వంశీకృష్ణ, శంకర్, అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఎసఈ నాగరాజు, డీఈ రవిప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత సమాజ భద్రతకు బలమైన పునాది

**మొదటిపేజీ తరువాయి**

సామాజిక బాధ్యతగా భావించాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి పేర్కొన్నారు. మంగళవారం ఎల్బీనగర్, ఉప్పల్ జోన్ పరిధిలోని ఎస్.హెచ్.జీ మహిళల కోసం నాగోల్ లో మంగళవారం వైభవంగా జరిగిన 'మీ సురక్ష - సహచరి' కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తమ కమిషనరేట్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం తెలంగాణ పోలీసింగ్‌కు సరికొత్త దిశానిర్దేశం చేస్తోందని, ఇది ఒక విప్లవాత్మక కార్యక్రమని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాలు (ఎస్.హెచ్.జీ ) మహిళలతో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడాన్ని పోలీస్ కమ్యూనిటీ లక్ష్యంగా పెట్టుకుందని.. మహిళల రక్షణ, సాధికారత, కుటుంబ సంక్షేమం, సామాజిక భద్రత అనే నాలుగు ప్రధాన స్తంభాలపై రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం, పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు మహిళల్లో భద్రతా భావనను పెంపొందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ ను భాగస్వామ్యం చేయడం జరిగిందన్నారు. మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు, పోలీస్ శాఖ, స్థానిక సమాజం కలిసి పనిచేసే సమగ్ర నమూనాగా 'సహచరి' రూపొందింది. సమస్య వచ్చిన తర్వాత స్పందించడం కాదు... సమస్యలు తలెత్తకుండా ముందుగానే నివారించడం, బాధిత మహిళలకు అండగా నిలవడం, అవసరమైన చట్టపరమైన, మానసిక, సామాజిక సహాయాన్ని అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలను కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్లుగా తీర్చిదిద్దుతూ, చట్టాలపై అవగాహన కల్పించి, ప్రజల భాగస్వామ్యంతో భద్రమైన, సురక్షితమైన సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం. మొదటి దశలో 3,195 మంది సహాయక సంఘాల మహిళలకు శిక్షణ అందించి, వారి ద్వారా 2.70 లక్షల మహిళల్లో మహిళా భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన, రోడ్డు భద్రత, చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ "మీ సురక్ష - సహచరి" ద్వారా ప్రతి ఇంటికి భద్రత, ప్రతి మహిళకు శక్తిని అందించాలనేది ప్రధాన ఉద్దేశ్యం. మొదటి దశలో వేలాది మంది స్వయం సహాయక సంఘాల మహిళలను కమ్యూనిటీ సేఫ్టీ అంబాసిడర్లుగా తీర్చిదిద్దనున్నామని, మహిళలు, పిల్లల భద్రత, సైబర్ నేరాల నివారణ, డ్రగ్స్ నిర్మూలన మరియు రోడ్డు భద్రతపై వీరికి ప్రత్యేక అవగాహన కల్పిస్తామన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్, సెర్ప్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాయని సీపీ చెప్పారు. శిక్షణ పొందిన మహిళలు కమిషనరేట్ పరిధిలో ఎస్.హెచ్.జీ మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని, ఈ కార్యక్రమం ద్వారా నేర నిరోధంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, పోలీస్‌కమ్యూనిటీ సంబంధాలను బలోపేతం చేయడం, సురక్షితమైన సమాజ నిర్మాణానికి తోడ్పడడం ప్రధాన లక్ష్యమన్నారు. సామాజిక భద్రతా అంబాసిడర్లు తమ పరిధిలోని ఎన్.హెచ్.ఓలతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, నేరాలను సకాలంలో పోలీసులకు తెలియజేసేలా ప్రజలను ప్రోత్సహించడం, గ్రామీణ స్థాయిలో పోలీస్‌కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం వంటి బాధ్యతలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పాల్గొనే మహిళలు పోలీస్ స్టేషన్లు, మహిళా పోలీస్ స్టేషన్లు, భరోసా కేంద్రాలు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ కేంద్రాలు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను సందర్శించి పోలీస్ సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందడంతోపాటు ఆయా సంస్థల పనితీరును తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఎల్బీనగర్ డీసీపీ అనురాధ, ఉప్పల్ డీసీపీ సురేష్ కుమార్, డిసిపి లక్ష్మి, ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య, నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ, ఉప్పల్ సీఐ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

# సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, జూలై 14, సిరి న్యూస్:**

తెలంగాణ ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బీసీ స్టడీ సర్కిల్ యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్‌కమ్‌మెయిన్స్)2027 ఉచిత శిక్షణ కార్యక్రమానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ కోచింగ్ 2026 ఆగస్టు 24 నుంచి 2027 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. మొత్తం 150మంది అభ్యర్థులకు శిక్షణ అందించనుండగా అందులో వందమంది ఓపెన్ కేటగిరీ ద్వారా 50మంది తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ ప్రిలిమ్స్ అర్హత పొందిన అభ్యర్థుల నుంచి ఎంపిక చేస్తారు.

**ఎంపికైన అభ్యర్థులకు కల్పించే సౌకర్యాలు**

నెలకు రూ.5,000 స్టయిఫండ్(నిబంధనల మేరకు), ఒకేసారి రూ.5,000 పుస్తక భృతి, గ్రంథాలయ సౌకర్యం, నిపుణుల ద్వారా ప్రత్యేక శిక్షణ, స్టడీ మెటీరియల్, మాక్ టెస్టులు, మార్గదర్శకత్వం.

**అర్హతలు**

గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ ఉత్తీర్ణత. కుటుంబ వార్షిక ఆదాయం. గ్రామీణ ప్రాంతం వారికి రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతం వారికి రూ.2 లక్షల లోపు. భారతీయ పౌరుడై తెలంగాణ నివాసి ఉండాలి. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్2027 నిబంధనల ప్రకారం వయోపరిమితి ఉండాలి.

**ముఖ్యమైన తేదీలు**

దరఖాస్తుల ప్రారంభం: 1572026, ఆన్‌లైన్ దరఖాస్తులు 1772026 నుంచి 782026 వరకు. హాల్ టికెట్ల డౌన్‌లోడ్: 1382026 నుంచి, స్క్రీనింగ్ టెస్ట్: 1682026, ఫలితాలు: 1982026, ధ్రువపత్రాల పరిశీలన: 218 2026 నుంచి తరగతుల ప్రారంభం: 2408 202. ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ విజ్ఞప్తి కోరారు.

# మోడీ-షా చాణక్య రాజనీతి ఫలించేనా?!

- మహిళా బిల్లు, డీలిమిటేషన్, జమిలి ఎన్నికలే టార్గెట్
- ఢిల్లీ వేదికగా కేంద్రం సన్నద్ధం
- పార్లమెంట్ సమావేశాలపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ
- ఏకకాలంలో ఎన్నికల నిర్వహణ కోసం చట్ట సవరణలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం
- జేపీసీ పరిధిలో ఉన్న పెండింగ్ బిల్లులను ఆమోదించుకునేందుకు చకచకా అడుగులు
- 30రోజులు జైల్లో ఉంటే పోటీకి అనర్హత వేసేలా సరికొత్త ప్రతిపాదన
- వక్ఫ్ బోర్డు చట్టంలో విప్లవాత్మక మార్పులతో సరికొత్త వ్యవస్థకు శ్రీకారం

**ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్:**



త్వరలో ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత, దేశ భవిష్యత్తును మార్చే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చట్టాలను తీసుకురావడమే లక్ష్యంగా మోదీ2.0 ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ సారి పార్లమెంట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల 'చాణక్య రాజనీతి' ఎలాంటి వ్యూహాలను తెరపైకి తేబోతోంది? విపక్షాల వ్యూహాలను చిత్తు చేస్తూ కేంద్రం తన మార్క్ బిల్లులను ఎలా ఆమోదించుకోబోతోంది? అనే అంశాలపై దేశం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ సమావేశాల్లో ప్రధానంగా మూడు చారిత్రాత్మక అంశాలను చట్టబద్ధం చేయడమే కేంద్రం ప్రధాన టార్గెట్‌గా కనిపిస్తోంది.

**మహిళా కోటా.. డీలిమిటేషన్, జమిలి లింక్..**

ఈ పార్లమెంట్ సమావేశాలలో కేంద్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలు.. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు, నియోజక వర్గాల పునర్విభజన, మరియు జమిలి ఎన్నికలు. దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలను పెంచేందుకు ఉద్దేశించిన డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేసి, దాని ఆధారంగానే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలని కేంద్రం పట్టుదలతో ఉంది. వీటికి తోడు దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించే చారిత్రాత్మక 'జమిలి' బిల్లును చట్టసభల ముందుకు తెచ్చేందుకు చకచకా అడుగులు పడుతున్నాయి. ఈ ప్రతిపాదనలపై జేపీసీ (ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ) నివేదికల ఆధారంగా రాజ్యాంగ సవరణలు చేసి, ఈ విడతలోనే బిల్లులకు ఆమోద ముద్ర వేయించుకోవాలని మోదీషా ద్వయం పక్కా స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది.

**జైలు శిక్ష పడితే పోటీకి అనర్హత..**

ఇక ఎన్నికల సంస్కరణల్లో భాగంగా కేంద్రం మరో సంచలన బిల్లును తెరపైకి తెస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రస్తుతం కోర్టుల ద్వారా శిక్ష పడితేనే ప్రజాప్రతినిధులపై అనర్హత వేటు పడుతుండగా, కొత్త నిబంధన ప్రకారం.. ఏదైనా కేసులో నిందితుడిగా ఉండి కనీసం 30 రోజుల పాటు జైల్లో (రిమాండ్ లేదా కస్టడీ) గడపాల్సి వస్తే, వారు ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేకుండా అనర్హత వేటు వేసేలా ప్రజాప్రాతినిధ్య చట్టంలో కీలక సవరణలు చేయాలని భావిస్తున్నారు. నేరచరితులు చట్టసభల్లోకి అడుగుపెట్టకుండా అడ్డుకట్ట వేసేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. ఈ బిల్లు గనుక ఆమోదం పొందితే దేశ రాజకీయాల్లో పెను మార్పులు సంభవించడం ఖాయంగా కనిపిస్తోంది.

**వక్ఫ్ బోర్డులో విప్లవాత్మక మార్పులు..**

గత కొంతకాలంగా దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన వక్ఫ్ బోర్డు అధికారాల వ్యవహారానికి కూడా ఈ సమావేశాల్లో ముగింపు పలకాలని కేంద్రం నిర్ణయించింది. పాత వఖ్ బోర్డు చట్టాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తూ, దాని స్థానంలో మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సరికొత్త చట్టాన్ని తీసుకురావడానికి బిల్లు సిద్ధమైంది. వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్, డిజిటలైజేషన్, ముస్లిం మహిళలకు బోర్డులో ప్రాధాన్యత కల్పించడంతో పాటు, బోర్డు అధికార పరిధిని నియంత్రించేలా ఈ కొత్త చట్టం ఉండబోతోంది. జేపీసీ పరిశీలన పూర్తి చేసుకుని సభ ముందుకు రానున్న ఈ బిల్లుల చుట్టూనే ఈ నెల పార్లమెంట్ సమావేశాలు తిరగనున్నాయి. అటు ప్రతిపక్షాలు కూటమిగా ఎదురుదాడికి సిద్ధమవుతుంటే, మోదీషాలు తమ చాణక్య వ్యూహాలతో ఎలా అధిగమిస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

# హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్‌పై ఏసీబీ పంజా

**హైదరాబాద్, జూలై 14 (సిరి న్యూస్):**



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) చీఫ్ ఇంజినీర్ బచ్చు రవీందర్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. ఈ సోదాల్లో ఆయనకు రూ.100 కోట్లకు పైగా అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించి, రవీందర్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని రవీందర్ ఇళ్లు, కార్యాలయాలు, బంధువులు, సన్నిహితుల నివాసాలు కలిపి మొత్తం 10కి పైగా ప్రాంతాల్లో ఏసీబీ బృందాలు ఏకకాలంలో సోదాలు చేపట్టాయి. ఈ దాడుల్లో అపారమైన స్థిర, చరాస్తులను అధికారులు గుర్తించారు. ప్రధానంగా మసీద్‌బండలో 4 అంతస్తుల భారీ భవనం, శంషాబాద్, షాబాద్ పరిధిలో 4 ఎకరాల వ్యవసాయ భూమి, శంకర్‌పల్లి, కిష్టాపూర్ ప్రాంతాల్లో భూములు, జడ్చర్లలో 7 ప్లాట్లు, కొండాపూర్‌లో 2 ఫ్లాట్లు, సుమధుర ఆక్రోపోలిస్, శ్రీవారి మెడోస్, వాసవి అట్లాంటిస్ వంటి ఖరీదైన ప్రాజెక్టుల్లో ఫ్లాట్లు, ప్లాట్లు.., వీటితో పాటు కిలో బంగారం, కిలోల కొద్దీ వెండి, నగదు, విలువైన విదేశీ మద్యం బాటిళ్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోదాల అనంతరం బచ్చు రవీందర్‌ను అరెస్ట్ చేసిన అధికారులు, ఆయన పెట్టుబడులు, బ్యాంక్ లావాదేవీలు మరియు ఆస్తుల మూలాలపై మరింత లోతుగా విచారణ చేపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూ ఇన్ని కోట్ల ఆస్తులు ఎలా సంపాదించారనే అంశంపై ఏసీబీ అధికారులు పూర్తిస్థాయి నివేదికను సిద్ధం చేస్తున్నారు. ఈ ఘటన నగరవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

# ఓల్డ్ బోయిన్‌పల్లి.. అక్రమ నిర్మాణాల సామ్రాజ్యం !

**మొదటిపేజీ తరువాయి**

స్థలాల్లో అనుమతుల్లేని కట్టడాలు నిత్యం వెలుస్తూనే ఉన్నాయి. స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అడుగుపెట్టిన దాఖలాలే లేవు.

**నోటీసులు, సెటిల్మెంట్లు**

**అన్నీ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో..**

ఇక్కడ అసలు విషయం ఏమిటంటే ఎక్కడ అక్రమ నిర్మాణం కనిపించినా అక్కడ ముందుగా వాలిపోతున్నది ప్రభుత్వ అధికారులు కాదు, ప్రైవేట్ వ్యక్తులే. నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసేది వీరే, పనులను పర్యవేక్షించేది వీరే, ఇక అక్రమ కట్టడాలపై సెటిల్మెంట్ వ్యవహారాలు..? కూడా వీరే చక్కబెడుతున్నారన్న ఆరోపణలు తీవ్ర సంచలనం రేపుతున్నాయి. ప్రభుత్వ అధికారం లేని వ్యక్తులు నోటీసులు ఇవ్వడం, డబ్బు వసూలు చేయడం ఎలా..? సాధ్యమవుతోందన్నది ఇప్పుడు అందరినీ వేధిస్తున్న



ప్రశ్న. ఈ తంతు మొత్తం పై అధికారులకు తెలియకుండానే జరుగుతుందా..? లేక వారి పూర్తి అనుమతితోనే సాగుతుందా..? అన్నది కీలకంగా మారింది. లక్షల్లో అవినీతి సొమ్ము వసూలు చేసేందుకు ఇదొక పకడ్బందీ టెక్నాలజీగా తీర్చిదిద్దారా అన్న అనుమానాలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. అసలు నిర్మాణాలకు అనుమతి ఉన్నాయా..? లేదా..? అని తేల్చాల్సింది ప్రభుత్వ అధికారులే అయినప్పుడు, ఆ పనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వెనుక భారీ కుంభకోణమే దాగి ఉందన్న వాదన బలపడుతోంది..

**కోట్లలో అవినీతి జరిగినట్టు అనుమానాలు ?**

ఓల్డ్ బోయిన్‌పల్లి సర్కిల్ -3 పరిధిలో లక్షల్లో కాదు, కోట్ల రూపాయల్లో అవినీతి జరిగి ఉండొచ్చనే అనుమానాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఎన్ని ఫిర్యాదులు, ఎన్ని ప్రశ్నలు వేసినా అధికారుల తీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదని, నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. లక్షల్లో జీతాలు తీసుకుంటూ, ప్రైవేట్ వ్యక్తులతో చేతులు కలిపి అక్రమంగా సంపాదిస్తున్న అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)తో సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అవినీతి మార్గంలో కూడబెట్టిన ఆస్తులను గుర్తించి ప్రభుత్వ ఖజానాకు జమ చేయించాలని, మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్‌తో సహా ఉన్నతాధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ నలుగురు ప్రైవేట్ వ్యక్తుల బాగోతంపై విచారణ జరిపించాలని బలంగా కోరుతున్నారు.

**అధికారులు ఎక్కడ? సాకులే సమాధానమా..?**

అక్రమ నిర్మాణాల విషయంలో డిప్యూటీ కమిషనర్‌ను వివరణ కోరగా ఎస్ఐఆర్ పనిలో బిజీగా ఉన్నానని బదులిస్తున్నారు. సర్కిల్ ఇన్‌చార్జి ఏసీపీని అడిగితే నాకు ఏమీ తెలియదు, నేను కొత్తగా వచ్చానని తప్పించుకుంటున్నారు. ఇక సెక్షన్ అధికారి అయితే రిటైర్మెంట్ దగ్గర పడిందని, కాళ్ళ నొప్పి, నడుము నొప్పితో ఇబ్బంది పడుతున్నానని సాకులు చెప్తున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన చైన్‌మెన్ కూడా అనారోగ్యం పేరుతో విధులకు దూరంగా ఉంటున్నట్టు తెలుస్తోంది.

**జీతాలు ప్రభుత్వ అధికారులకు,**

**పని మాత్రం ప్రైవేట్ చేతుల్లో..**

డిప్యూటీ కమిషనర్, ఏసీపీ, సెక్షన్ అధికారి, చైన్‌మెన్, ఈ నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు లక్షల్లో జీతాలు తీసుకుంటున్నారు. వాస్తవంగా విధులు నిర్వహిస్తున్నది మాత్రం నలుగురు ప్రైవేట్ వ్యక్తులేనన్న ఆరోపణలు స్థానికుల్లో ఆగ్రహం రేకెత్తిస్తున్నాయి. ప్రైవేట్ వ్యక్తులే అన్ని పనులు చేస్తున్నప్పుడు, ప్రభుత్వం ఈ అధికారులకు లక్షల్లో జీతాలు ఎందుకు చెల్లిస్తోంది..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**ఏసీబీ నిఘా పెట్టాలి..: అరుణ్, స్థానికుడు - ఓల్డ్ బోయిన్‌పల్లి**



ఓల్డ్ బోయినపల్లి సర్కిల్-3లో ప్రభుత్వం, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఉమ్మడిగా నిఘా పెడితే ప్రభుత్వ ఖజానాలో భారీ మొత్తంలో అవినీతి సొమ్ము జమ అవుతుంది. ఇన్ని అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా ఏ ఒక్క డివిజన్‌లోనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన దాఖలాలు లేవు. అసలు అధికారులు ఉన్నారా, లేరా? ఈ ప్రైవేట్ వ్యక్తులు ఎవరు..? వీరికి ఈ అధికారం ఎవరిచ్చారు..? అనే కోణంలో పూర్తి విచారణ చేయించాలి.

## లింగంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ తనిఖీ




**మునిపల్లి, జూలై 14 (సిరి న్యూస్):**

మునిపల్లి మండలం లింగంపల్లి ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి (ఎంఈఓ), కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మంగళవారం నెలవారీ తనిఖీల్లో భాగంగా సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్ (FLN) కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తెలుగు చదవడం, రాయడం నైపుణ్యాలతో పాటు గణితంలోని కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం అంశాలపై వారి అభ్యసన స్థాయిని పరిశీలించారు.తరగతి గదుల్లో జరుగుతున్న బోధనాభ్యాసన ప్రక్రియ, విద్యార్థుల అభ్యసన ప్రగతిని పరిశీలించిన అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా అందజేస్తున్న ఉచిత హ్యాండ్‌రైటింగ్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ను సమర్థంగా వినియోగించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి అభ్యసన ఫలితాలను మెరుగుపరిచేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## గోపులారం గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



**కొండాపూర్ జులై 14 (సిరిన్యూస్)**

కొండాపూర్ మండలం గోపులారం గ్రామంలో 7.5 లక్షల రూపాయల సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ మహేశ్వరి సతీష్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ గౌడ్, వెంకటేశం గౌడ్, వినీత్, జానయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు

## ప్రతి ఒక్కరు SIR ప్రక్రియను సద్వినియోగించుకోవాలి...

### తాహసిల్దార్ విజయలక్ష్మి

**వెల్దుర్తి, జులై 14, (సిరి న్యూస్):**



మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో SIR ప్రక్రియ 50% పూర్తి అయిందని మండల రెవెన్యూ అధికారి విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫారాలను సమర్పించాలని సూచించారు. ఫారాల స్వీకరణ ప్రక్రియను అధికారులు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ SIR ప్రక్రియను అందరూ వినియోగించుకోవాలని ఆమె సూచించారు. బి ఎల్ ఓ లు స్వీకరించిన ఫారాలు వెంట వెంటనే డిజిటలైజే చేయాలని ఆదేశించారు. ఫారాలు పూరించడంలో బిఎల్ వో లదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాలని వారు తెలిపారు.

## టిఫిన్ సెంటర్ లపై కేసు నమోదు

### ఇద్దరు మైనర్ బాలురులతో పని చేపిస్తున్నారని కేసు నమోదు

**నర్సాపూర్ జూలై 14 (సిరి న్యూస్)**




నర్సాపూర్ పట్టణంలోని మెదక్ జాతీయ రహదారి పక్కన బిటెక్ చాయ్ వాలా, జై గురుదత్త టిఫిన్ సెంటర్ లలో మైనర్ బాలురులు పని చేస్తున్నారని సమాచారం అందడంతో బాల కార్మిక కార్యాలయం ఆఫీసర్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు టిఫిన్ సెంటర్ యజమానులు కొన్యాల రాజు, కరిపే రమేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నర్సాపూర్ ఎస్సై రంజిత్ కుమార్ తెలిపారు

# ఆగ్రగామిగా మెదక్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా..

- మెదక్ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యం.
- మెదక్ శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు.
- 2కోట్ల తొంబైముడు లక్షలతో మెదక్ అభివృధి పనులు.
- పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన.
- ప్రతి వార్డుకు సమాన అభివృద్దే లక్ష్యం..
- మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.



**మెదక్ జూలై,14(సిరి న్యూస్)**

కోట్ల రూపాయల అభివృద్ది పనులతో ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.పట్టణ సమగ్రాభివృద్ధి దిశగా మరో కీలక అడుగు పడిందన్నారు. పట్టణంలోని 31, 30, 23, 22, 20, 16, 17, 18, 19, 21, 28 వార్డుల్లో సీసీ రోడ్లు మరియు మురికి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఆయా వార్డుల ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి అభివృద్ధి కార్యక్రమాలకు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ "మెదక్ ప్రజలు నాపై ఉంచిన విశ్వాసాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి అందించడం నా బాధ్యత అన్నారు.పట్టణంలోని ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యత ఇస్తూ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం నా లక్ష్యం అని పేర్కొన్నారు.రహదారులు,డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అన్ని రంగాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.గతంలో ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో కూడా ప్రస్తుతం సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.మెదక్ పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో కూడిన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కోట్ల రూపాయల నిధులను తీసుకువస్తున్నామని తెలిపారు. అభివృద్ధి అనేది కేవలం హామీలతో కాకుండా పనులతో కనిపించాలనే ఉద్దేశంతో నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యలను స్వయంగా పరిశీలించి వెంటనే పరిష్కరిస్తున్నామని అన్నారు.

**ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తా**

ఏ వార్డు వెనుకబడకుండా ప్రతి ప్రాంతంలో సమానంగా అభివృద్ధి జరుగుతుంది. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించి మెదక్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలబెడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు కూడా పనుల నాణ్యతను పరిశీలిస్తూ తమ సూచనలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి అధికార దురహంకారానికి పరాకాష్ట.

- బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి.
- ముఖ్యమంత్రిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నాయకులు.

**అనంతగిరి, జూలై 14 (సిరి న్యూస్):**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నాయకులపై చేసిన వ్యాఖ్యలు రాష్ట్రం లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని వెంటనే ముఖ్యమంత్రి పై కేసు నమోదు చేయాలని అనంతగిరి మండలం బి ఆర్ యస్ పార్టీ నాయకులు మంగళవారం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు నల్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాజెక్టులు నిండక సూపర్ ఎలోనిన్ ప్రభావంతో తీవ్ర వర్షభావ పరిస్థితిలలో రైతులు దిక్కు తోచక వారి పరిస్తితి అగమ్య గోచరంగా ఉన్న తరుణంలో ముఖ్యమంత్రి ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్న కు బహిరంగంగా అయన సమాధానం ఈ కరువు సమస్య తీరాలంటే కెసిఆర్, కేటీర్,హరీష్ రావు, మొత్తం కెసిఆర్ కుటుంబ సభ్యులు, యావత్తెలంగాణ రైతుల రక్తాన్ని తెలంగాణ రైతుల పొలాల్లో చల్లాలి అని వ్యాఖ్యనించడం సిగ్గుచేటు అని అన్నారు. అంతేకాక ఈ ప్రతిపక్ష నాయకులు తమ ఒంటికి బండ రాయి కట్టుకొని కాళేశ్వరం ప్రాజెక్టు లో దూకి చావాలి అని అనడం అతని అధికార దురంకాహరానికి పరకాష్ట అని పేర్కొన్నారు. ఇలాంటి తీవ్ర పదజాలం వాడిన సీఎం రేవంత్ రెడ్డి పై కేసు నమోదు చేసి రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమం లో పార్టీ ఉపాధ్యక్షులు మట్టపల్లి పుల్లయ్య గౌడ్, అబ్జల్, సీనియర్ నాయకులు పందిరి వీరయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు చార్లెస్, కంటూ శ్రీకాంత్, కాకని వెంకటేశ్వర్లు, దొంగరి నాగేశ్వరావు, యాకుబ్ పాషా, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ ఓటరు జాబితాకు పునాదిగా ఎస్ఐఆర్

- హెల్ప్ డెస్క్‌ను పరిశీలించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**గుమ్మడిదల, జూలై 14 (సిరి న్యూస్):**




ఓటరు జాబితాను పారదర్శకంగా, సమగ్రంగా రూపొందించేందుకు చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ భవిష్యత్ ఎన్నికలకు బలమైన పునాదిగా నిలుస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం గుమ్మడిదలలో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను ఆయన సందర్శించి దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులతో మాట్లాడిన ఆయన, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మినహాయించబడకుండా ప్రతి దరఖాస్తును నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని కొరారు. ప్రక్రియలో పారదర్శకతతో పాటు వేగం కూడా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులంతా సకాలంలో దరఖాస్తులు సమర్పించాలి ప్రజలు కూడా ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, వివరాలను సకాలంలో సమర్పించి అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన హక్కు అని, దానిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఓటరు జాబితాలో పేర్లు సక్రమంగా నమోదైతేనే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరి చూసుకుని నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

# ఓటరు జాబితా సవరణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

- 11వ వార్డులో ఎస్ఐఆర్‌పై ఇంటింటికీ అవగాహన కల్పించిన మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్

**గుమ్మడిదల, జూలై 14 (సిరి న్యూస్):**



ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఓటర్లను కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను మరింత సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించే లక్ష్యంతో ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అర్హత పొందిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు, ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే వాటిని సరిచేయడం, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు కూడా ఈ ప్రక్రియలో భాగమేనని వివరించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నందున ప్రజలు అవసరమైన పత్రాలను అందించి సహకరించాలని కోరారు. ప్రతి ఓటరు తన వివరాలను ఒకసారి పరిశీలించుకోవడం ద్వారా తప్పులులేని ఓటరు జాబితా రూపొందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల సహకారంతోనే ఎన్నికల ప్రక్రియ మరింత విశ్వసనీయంగా, పారదర్శకంగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీకేజీ యువసేన సభ్యులు, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యం ఒక్కటే ఇంటింటికి రక్షిత నీరు!

- 55 లక్షలతో పైప్ లైన్ పనులు షురూ
- ఎమ్మెల్యే 'మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి చేతులమీదుగా ప్రారంభం!

**అమీన్పూర్ జూలై 14 సిరి న్యూస్**



అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని టైలర్స్ కాలనీలో జలమండలి ఆధ్వర్యంలో రూ. 55 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్ లైన్ నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తో కలిసి మాజీ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 55 లక్షలతో అభివృద్ధి టైలర్స్ కాలనీ నివాస్తుల చిరకాల స్వప్నమైన మంచినీటి సమస్య పరిష్కారానికి 55 లక్షల నిధులతో పైప్ లైన్ పనులను ప్రారంభించామని తెలిపారు. ప్రతి ఇంటికి రక్షిత జలం నియోజకవర్గంలో ప్రతి గడపకు స్వచ్ఛమైన సురక్షితమైన తాగునీరు అందించడమే మా ప్రధాన లక్ష్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవానంద్ ముదిరాజ్, సుధాకర్ రెడ్డి, జలమండలి జిఎం శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి గోపాల్ బాలరాజ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

# టిఎస్ ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

- కార్మికుల హక్కుల పరిరక్షనే ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్యం
- కార్మికులపై అధికారుల వేధింపుల ఆపాలి
- ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న
- మెదక్ లో ఎంప్లాయిస్ యూనియన్ భారీ ర్యాలీ

**మెదక్ జూలై 14(సిరి న్యూస్)**

తెలంగాణ ఆర్టీసీని ప్రభుత్వం యూనియన్ తీసేందుకు కుట్ర చేస్తుందని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న విమర్శించారు. సోమవారం మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవన్లో ఎంప్లాయిస్ యూనియన్ మెదక్ రీజియన్ మహాసభ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వెంకన్న మాట్లాడుతూ ఎర్రజెండ ద్వారానే కార్మికుల హక్కులు పరిష్కరించబడతాయన్నారు.కార్మికుల హక్కుల పరిరక్షనే ఎంప్లాయిస్ యూనియన్ లక్ష్యమన్నారు.కార్మికులపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మెజార్టీ బస్సులు స్క్రాప్ దశకు చేరాయని, వాటి స్థానంలో కొత్త బస్సులు ఏర్పాటు చేసి ప్రయాణికులకు సేవలందించాలన్నారు.ఆర్టీసి ని ప్రభుత్వంలో విలీనం చేసి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే బెనిఫిట్స్ ఆర్టీసీ కార్మికులకు కల్పించాలన్నారు.సేవా సంస్థలను లాభాల దృష్టిలో చూడొద్దని, ప్రజలకు ఏ విదంగా సేవలు అందుతున్నాయో చూడాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం, కార్పొరేషన్ ఇవ్వాల్సిన బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. లేకుంటే ఆర్టీసీ మనుగడకే



ప్రమాదం వాటిల్లే పరిస్థితులు ఉన్నాయన్నారు.ఈ సందర్బంగా వివిధ డిపోల ఇతర యూనియన్ లలో నుండి కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న సమక్షంలో వందల సంఖ్యలో ఎంప్లాయిస్ యూనియన్ లో చేరారు. ఈ సందర్బంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎంప్లాయిస్ యూనియన్ మెదక్ రిజియన్ నాయకులు ఎన్ ప్రసాద్ రెడ్డి,టిఎల్ రావు జి .శేషు, మెదక్ డిపో గౌరవ అధ్యక్షులు టి .సుభాష్ చంద్ర భోస్,మెదక్ డిపో నాయకులు సర్వన్, కిష్టయ్య, అనంతం, మల్లేష్, దేవేందర్ గౌడ్, శేఖర్ గౌడ్, ఆంజనేయులు యేసు, షకీల్, శేఖమ్మ, శ్రవంతి, భాగ్యమ్మ, మేనక, నరేందర్ మరియు వివిధ డిపోల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీరభద్రస్వామి ఆలయంలో వైభవంగా రుద్రహోమం

- వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజలు
- ప్రతి అమావాస్యకు రుద్రహోమం,
- ప్రతి పౌర్ణమికి చండీహోం

**గుమ్మడిదల, జులై 14 (సిరి న్యూస్):**



అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం రుద్రహోమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హోమగుండంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య రుద్రహోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగి పోయారు. హిందూ సంప్రదాయంలో రుద్రహోమానికి విశిష్టమైన స్థానం ఉందని, ఇది దుష్టశక్తుల నివారణతో పాటు మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తుందని అర్చకులు తెలిపారు.హోమ కార్యక్రమం అనంతరం పూర్ణాహుతి నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వేదఘోషలు, శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ఆలయంలో ప్రతి అమావాస్య రోజున రుద్రహోమం, ప్రతి పౌర్ణమి సందర్భంగా చండీహోమాన్ని క్రమం నిర్వహిస్తున్నారు ఈ హోమాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేయించుకోవాలనుకునే భక్తులు ఆలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.అమావాస్య సందర్భంగా నిర్వహించిన రుద్రహోమం ద్వారా భక్తులకు శాంతి, సౌభాగ్యం, ఆరోగ్యం, ఆయురారోగ్యాలు కలుగుతాయని అర్చకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గుమ్మడిదల పురపాలక సంఘం కౌన్సిలర్ నరేందర్ రెడ్డి దంపతులు, ఆలయ సిబ్బంది సోమయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల గోడు..సీఎంకు లేఖ.!

- టీజేఏసీ నాయకులకే ప్రాధాన్యత.?..
- నిజమైన ఉద్యమకారులకు అన్యాయమా.?..
- సీఎం జోక్యం కోరిన డా. చీమ శ్రీనివాస్..
- గుర్తింపు కమిటీపై విచారణ డిమాండ్..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 14 ( సిరి న్యూస్ )**



తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమీక్ష సమావేశాల్లో జరుగుతున్న లోపాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, నిజమైన ఉద్యమకారులకు న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయడం స్వాగతించదగ్గ నిర్ణయమని తెలిపారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న జిల్లా సమీక్ష సమావేశాల్లో నిజమైన ఉద్యమకారులకు కాకుండా కొందరు పాత టీజేఏసీ నాయకులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.2014 తర్వాత టీజేఏసీతో తమకు సంబంధం లేదని ప్రకటించిన వారినే ఇప్పుడు సమావేశాలకు ఆహ్వానించడం విచారకరమని అన్నారు. గత ప్రభుత్వంలో పదవులు పొందిన పలువురు నాయకులు ఉద్యమకారుల సమస్యలపై స్పందించలేదని విమర్శించారు.జిల్లా సమీక్ష సమావేశాలకు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పనిచేసిన ప్రతి ఉద్యమకారుడికి అవకాశం కల్పించాలని, కొందరిని మాత్రమే ఎంపిక చేసి సమావేశాలు నిర్వహించడం సరికాదన్నారు. ఉద్యమకారుల సంఘాలకు తగిన ప్రాధాన్యత కల్పించి, జరుగుతున్న లోపాలపై విచారణ జరిపి పారదర్శకంగా గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు..

# డ్రగ్స్ కు యువత దూరంగా ఉండాలి

- బి.వి.ఆర్.ఐ.టి కళాశాలలో డ్రక్స్ పై అవగాహన సదస్సు

**నర్సాపూర్, జూలై 14,( సిరి న్యూస్).**

నేటి కాలంలో యువత డ్రగ్స్ కు మారక ద్రవ్యాలకు అలవాటు పడుతున్న నేపథ్యంలో యువతలో అవగాహన కల్పించాలని నర్సాపూర్ బి.వి.ఆర్.ఐ.టి (BVRIT) కళాశాలలో నర్సాపూర్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం "డ్రగ్స్ నియంత్రణ అవగాహన సదస్సు" నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా మెదక్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సతీష్ కుమార్ పాల్గొన్నారు వారు మాట్లాడుతూ ప్రస్తుతం యువతలలో మాదక ద్రవ్యాలను డ్రగ్స్ కు ఎక్కువగా బానిసలు అవుతున్నారు వయువతను వేధిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారి పై నియంత్రణ చేయుటలో అందరం భాగస్వామ్యం కావాలని అన్నారు డ్రగ్స్కు నో (NO) చెప్పండిమాదకద్రవ్యాల వలన మెదడులో కలిగే 'డోపమైన్' ప్రభావం గురించి వివరించారు. ఈ అలవాట్లు మెదడు సంకేత వ్యవస్థను ఎలా నిర్వీర్యం చేస్తాయో, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఆరోగ్యం ప్రభావితం చేస్తుందని అన్నారు విద్యార్థులు డ్రగ్స్కు ఖచ్చితంగా దూరంగా ఉండాలని అన్నారు.బీవిఆర్ఐటి డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబే మాట్లాడుతూ విద్యార్థులు తోటివారి ఒత్తిళ్లకు లొంగకుండా అప్రమత్తంగా ఉండాలని, ఉజ్వల భవిష్యత్తు కోసం చదువు పైనే దృష్టి పెట్టాలని డ్రగ్స్ కు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారుఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ గులాం



ముస్తఫా ఎస్.ఐ సుచరిత సి.ఐ (CI) రాఘవేంద్రరావు, ఎస్.ఐ అజీజ్ ఖాన్, ఎస్.ఐ అరుణ, డి.టి.ఎఫ్ సి.ఐ (DTF CI) గోపాల్, డి.టి.ఎఫ్ ఎస్.ఐ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో డీపీఓ, డీఎల్పీఓ తనిఖీలు..

**హత్నూర, జూలై 14,(సిరి న్యూస్):**

సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) మల్లారెడ్డి, జిల్లా స్థానిక సంస్థల పంచాయతీ అధికారి (డీఎల్పీఓ) అనిత మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులు, బియ్యం, పప్పులు, నూనెతో పాటు కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలపై అధికారులతో చర్చించారు.అలాగే పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, మౌలిక వసతులు, తాగునీరు,





పారిశుద్ధ్యం, వసతి గృహాల పరిస్థితి తదితర అంశాలపై సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఆహార నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు.పాఠశాల నిర్వహణను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని డీపీఓ మల్లారెడ్డి, డీఎల్పీఓ అనిత ఆదేశించారు. ఈ తనిఖీల్లో సంబంధిత శాఖ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య కమిటీ సంఘం ఎన్నిక

## ప్రచార కార్యదర్శి గా బుర్గోజు బాలబ్రహ్మం



**గజ్వేల్ జులై 14 (సిరి న్యూస్ )**

హైదరాబాద్: నగరంలోని తుల్జా భవన్లో తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ, తిమ్మారెడ్డిపల్లి అంజనేయ స్వామి దేవాలయ అర్చకుడు భూర్గోజు భాలబ్రహ్మమును తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమిస్తూ శాలువాతో సన్మానించారు.ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరేశ్వర శర్మ, కోశాధికారి హరికృష్ణ శర్మ, అధికార ప్రతినిధి మనోహర్ శర్మ, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం వీరభద్రయ్య తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అనంతరం భాలబ్రహ్మము మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి, అర్చకుల ఉద్యోగ భద్రత కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈకార్యక్రమంలో అర్చకులు పాలొన్నారు

# శివంపేట్ లో గంజాయి కలకలం

## 33 గ్రాముల స్వాధీనం!!

## ఇద్దరు అరెస్ట్ రిమాండ్ కు తరలింపు!!



**శివంపేట్ జులై 14 (సిరి న్యూస్ )**

నమ్మదగిన సమాచారం మేరకు ఇద్దరు వ్యక్తులు శివంపేట గ్యాస్ గోదాం దగ్గరలో గంజాయి సరఫరా చేస్తున్నారన్న సమాచారం మేరకు శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి తన సిబ్బందితో యుక్తంగా వెళ్లి వారిని పట్టుకుని విచారించగా వారి దగ్గర దాదాపు 33 గ్రాముల గంజాయి లభించడం జరిగింది వారు దానిని శివంపేట మండలంలోని కొంతమందికి అమ్మే ప్రయత్నం చేయడానికి తెచ్చారని దానిద్వారా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశతో ఈ విధంగా చేశామని చెప్పడం జరిగింది ఇట్టి గంజాయిని సీజ్ చేసి వారి మీద ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ చేయడం జరుగుతుంది అదేవిధంగా వారిద్దరి దగ్గర నుంచి రెండు సెల్ ఫోన్లు కూడా సీజ్ చేయడం జరిగింది.

**అరెస్టు అయిన నిందితుల వివరాలు**

★1)మార్తమన్ గణేష్ తండ్రి యాదగిరి
**వయస**్సు 26, నివాసం శభాష్ పల్లి,
2) గౌర హమేత్ సింగ్★★
★తండ్రి పురమ్ సింగ్
**వయస్సు:** 32 నివాసం తూప్రాన్
వీరిద్దరిని రిమాండ్ కు తరలించడం జరిగింది

# బెస్ట్ బి ఎల్ వో కు గణ సన్మానం

## 100% ఎస్ఐఆర్ పూర్తిచేసిన బిఎల్ఓ సుజాత



**రామాయంపేట, జూలై 14 (సిరి న్యూస్)**

రామాయంపేట మున్సిపల్ పరిధిలో 1వ వార్డు లో ని 76వ బూత్ లో సర్, ఇమ్యూనరేషన్ ఫామ్ డిజిటలైజేషన్ కార్యక్రమం మొట్టమొదటగా ఆ వార్డు (బి యల్ ఓ )అంగన్వాడీ టీచర్ బి సుజాత పూర్తి చేయటం జరిగింది. అందువలన సంబంధితఆ బియల్ఓ ను మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు, తహసీల్దార్ రజనికుమారి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమం లో కమిషనర్ రవీందర్,డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్ ఆర్ ఐ, సర్ సూపరవైజర్, కౌన్సిలర్స్ దేవుని రంజిత్, కోఆప్షన్ సభ్యుడుదేమే యాదగిరి, డి సి సి ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, డి సి సి కార్యదర్శి పోచమ్మల గణేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరే లక్ష్యం..వేగంగా ఎస్ఐఆర్...

- సిరి కథనానికి సానుకూల స్పందన.. క్షేత్రస్థాయిలో నల్లోల రాజేందర్.!..
- ఎస్ఐఆర్ వేగవంతానికి అధికారులకు కీలక సూచనలు..!..
- మన ఓటు.. మన హక్కుఅంటూ ప్రజల్లో అవగాహన.!..
- అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం.!..



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూలై 14 ( సిరి న్యూస్ ):**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట్ డివిజన్లలో ప్రత్యేక ఓటరు నమోదు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై సిరి తెలుగు దినపత్రిక ప్రచురించిన వరుస కథనాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు అధికార యంత్రాంగం దృష్టిని ఆకర్షించాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్ డైరెక్టర్ నల్లోల రాజేందర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ గడువు సమీపిస్తున్నందున ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటరు జాబితా నుంచి తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఓటరికి అవసరమైన సేవలు అందించాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసి ప్రక్రియను సమర్థవంతంగా ముగించాలని అధికారులను కోరారు. ప్రజల్లో అవగాహన కల్పిస్తూ నల్లోల రాజేందర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతి పౌరుడికి ఓటు హక్కు లభించేలా రాజ్యాంగబద్ధమైన పునాది వేశారని గుర్తు చేశారు. ఆ గొప్ప హక్కును ప్రతి పౌరుడు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ కూడా అదే ఓటు హక్కును పరిరక్షించే కీలక కార్యక్రమమని పేర్కొన్నారు. మన ఓటు..మన హక్కు..మన బాధ్యత అనే భావనతో ప్రతి అర్హుడైన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, అవసరమైతే వెంటనే సవరణలు చేయించుకోవాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, ఆ హక్కును వినియోగించుకునే అవకాశాన్ని ఎవరూ కోల్పోకూడదన్నారు.ఈ సందర్భంగా బీఎల్‌వోలకు పూర్తి సహకారం అందించాలని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేసిన ఆయన, ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేస్తే ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత విజయవంతమవుతుందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ప్రతి ఇంటికి సేవలు చేరేలా చర్యలు కొనసాగించాలని సూచించారు. సిరి తెలుగు దినపత్రిక ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, వాటి పరిష్కారానికి సంబంధిత వర్గాల స్పందన తీసుకురావడమే తన బాధ్యతగా భావిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఎస్ఐఆర్ గడువు ముగిసేలోపు ప్రతి అర్హుడైన ఓటరికి న్యాయం జరిగేలా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు. ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని నొక్కి చెబుతున్నారు..



# ఓటు కక్షతో..నీటి కష్టాలు..!

- తాగునీటిపై రాజకీయ కక్ష..!..
- ప్రభుత్వ బోరు.. ప్రజలకు దూరం.!..
- అధికారుల నిర్లక్ష్యంపై భగ్గుమన్న కాలనీ.!..
- నోటీసులు ఇచ్చినా ఫలితం శూన్యం.!..
- మండలవ్యాప్త ఉద్యమానికి సిద్ధం.!..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 14 (సిరి న్యూస్)**





మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలం చిత్తాపూర్ గ్రామంలోని 10వ వార్డు ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య రోజురోజుకూ ఉద్రిక్తంగా మారుతోంది. ప్రజల కోసం దాదాపు 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రభుత్వ బోరు కొందరి ఆధీనంలో ఉండటంతో కాలనీవాసులు గత ఏడు నెలలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయలేదనే కక్షతోనే ప్రభుత్వ బోరును ప్రజలకు అందకుండా చేస్తున్నారని సర్పంచ్ ఓరం కమల, ఉపసర్పంచ్ తీగుళ్ల వెంకటేశ్వర్లు, కాలనీవాసులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు..

### నోటీసులు ఇచ్చినా...చర్యలు ఎక్కడ..?..

గ్రామ పంచాయతీ సెక్రటరీ నోటీసులు జారీ చేసినా వాటిని అమలు చేయించడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తిని వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు మోటార్‌ను తొలగించకపోవడం, బోరును తిరిగి ప్రజలకు అప్పగించకపోవడం అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

### రాజకీయ ఒత్తిడా...లేక అధికారుల నిర్లక్ష్యమా.?..

ప్రభుత్వ బోరుపై ఇంత పెద్ద వివాదం నెలకొన్నా సంబంధిత శాఖలు ఎందుకు స్పందించడం లేదని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం రాజకీయ ఒత్తిడికి తలొగ్గుతోందా.? లేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందా.? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### ఏడు నెలలుగా నీటి కోసం నరకయాతన..

ప్రభుత్వ బోరు అందుబాటులో లేక మహిళలు, వృద్ధులు, చిన్నారులు రైతు వేదిక వరకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. రోజువారీ కూలీలు పనులు మానేసి నీటి కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని, తాగునీరు కూడా అందని పరిస్థితిలో జీవిస్తున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులపై కాలనీవాసుల ఆగ్రహం..

ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించకపోవడంతో కాలనీవాసుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తాగునీరు వంటి ప్రాథమిక హక్కు కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని వారు మండిపడుతున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని అధికారుల వైఖరిని నిరసిస్తూ త్వరలో మండల స్థాయిలో ఆందోళన చేపట్టేందుకు కాలనీవాసులు సిద్ధమవుతున్నారు.

### పరిష్కారం లేకుంటే మండలవ్యాప్తంగా ఉద్యమం..

తమ తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించకపోతే మండలవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమానికి దిగుతామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు. మండల కార్యాలయం ముట్టడి, నిరసన దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు వంటి ఆందోళన కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేస్తున్నారు. ప్రజలకు తాగునీరు అందించలేని అధికార యంత్రాంగం తమ బాధ్యతను నిర్వర్తించాలని, లేకపోతే ప్రజా ఉద్యమాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

### జిల్లా యంత్రాంగం స్పందిస్తుందా.?..

ప్రజావాణిలో మరోసారి ఫిర్యాదు చేరడంతో ఇప్పుడు జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులు ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరిస్తారా.? ప్రభుత్వ బోరును తిరిగి ప్రజల వినియోగానికి అందుబాటులోకి తెస్తారా.? బాధ్యులపై చర్యలు తీసుకుంటారా.? అనే అంశాలు ఆసక్తికరంగా మారాయి. అధికారుల చర్యలపైనే ఇప్పుడు కాలనీవాసుల ఆశలు నిలిచాయి.

### ప్రజల పక్షాన సిరి తెలుగు దినపత్రిక..

ఎస్టీ కాలనీ ప్రజలకు న్యాయం జరిగే వరకు, ప్రభుత్వ బోరు తిరిగి ప్రజలకు అందే వరకు, అధికారుల చర్యలు పూర్తయ్యే వరకు ఈ అంశంపై సిరి తెలుగు దినపత్రిక నిరంతరం ఫాలోఅప్ కథనాలను ప్రచురిస్తూ ప్రజల గొంతుకగా నిలుస్తుంది.



పంచాయతీ సెక్రెటరీ నోటీసు ఇచ్చిన దృశ్యం

# రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో పంటలకు రక్తాన్ని చల్లిన రైతులు







**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూలై 14 (సిరిన్యూస్):**

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం సేవాలాల్ తండాలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో రైతులు వారి రక్తం తీసి పంటలకు చల్లి, "నీ కళ్లు చల్లబడ్డాయా? ఇప్పటికైనా నీళ్లు ఇవ్వు" అని రేవంత్ రెడ్డి పై మండిపడ్డారు రైతులు.

# బ్యానర్ చిచ్చు..తాండూరులో రగడ..!

- దళిత సర్పంచ్‌కు అవమానమా..?..
- బ్యానర్ వివాదంతో రగిలిన తాండూరు..
- రఘునాథ్ రెడ్డిపై రాజీనామా డిమాండ్..
- నిరసనలతో ప్రభుత్వ కార్యక్రమం రసాభాస..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 14 (సిరి న్యూస్)**

ప్రభుత్వ అవగాహన కార్యక్రమంలో దళిత సర్పంచ్‌కు అవమానం జరిగిందన్న ఆరోపణలతో తాండూరులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆహ్వాన బ్యానర్‌లో స్థానిక సర్పంచ్ చిత్రాన్ని తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సర్పంచ్, ఆయన అనుచరులు నిరసనకు దిగడంతో కార్యక్రమం కొంతసేపు నిలిచిపోయి రసాభాసగా మారింది. బెల్లంపల్లి నియోజకవర్గంలోని తాండూరులో నిర్వహించిన ప్రభుత్వ అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. అయితే కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ఆహ్వాన బ్యానర్‌లో తాండూరు గ్రామ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ చిత్రాన్ని పొందుపరచకపోవడంపై వివాదం చెలరేగింది. ప్రోటోకాల్ ప్రకారం తన చిత్రం బ్యానర్‌లో ఉండాల్సి ఉండగా, ఉద్దేశపూర్వకంగానే తొలగించారని సర్పంచ్ ముడిమడుగుల సురేష్ ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డిని ఆయన నిలదీయడంతో అక్కడ వాగ్వాదం చోటుచేసుకుంది. సర్పంచ్‌కు మద్దతుగా ఆయన అనుచరులు, స్థానిక నాయకులు నిరసనకు దిగారు. తాండూరు మండల అధ్యక్షుడు శంకర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి కావాలనే దళిత సర్పంచ్‌ను అవమానించారని ఆరోపిస్తూ నినాదాలు చేశారు. పిన్నింటి రఘునాథ్ రెడ్డి వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలతో కార్యక్రమం కొంతసేపు ఉద్రిక్తంగా మారి నిలిచిపోయింది. అనంతరం నాయకులు జోక్యం చేసుకుని పరిస్థితిని సద్దుమణిగేలా చేయడంతో కార్యక్రమం ముగిసింది. అయితే దళిత ప్రజాప్రతినిధికి జరిగిన అవమానంపై స్థానికంగా తీవ్ర చర్చ సాగుతోంది.




# ప్రభుత్వ విద్య, వైద్యం కోసం జూలై 27న సూర్యాపేట కలెక్టరేట్ ముట్టడి

- సూర్యాపేట కలెక్టరేట్ ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి పిలుపు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూలై 14 (సిరిన్యూస్):**

ప్రభుత్వ విద్య, ప్రభుత్వ వైద్య రంగాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న సూర్యాపేట కలెక్టరేట్ ముందు ధర్నా, ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేయడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల లేమి, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాల సమస్యలు పెద్ద ఎత్తున ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ఖాళీలు, మందుల కొరత, పరీక్షా పరికరాల లేమి, 24 గంటల సేవలు అందకపోవడంతో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పుల పాలవుతున్నారని చెప్పారు.ప్రజల పన్నుల డబ్బుతో నడిచే ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణకు ప్రోత్సహించడం ప్రజల హక్కులపై దాడి అని ఆయన విమర్శించారు. ప్రభుత్వ విద్య, వైద్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అన్నారు. ఈ సమస్యలపై జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, పిహెచ్‌సిల్లో సిపిఎం ఆధ్వర్యంలో సమగ్ర సర్వే నిర్వహించి, సమస్యలను నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు అందజేసి పరిష్కరించాలని డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు.




### ప్రభుత్వ పాఠశాలలు, పిహెచ్‌సి లలో మొదలుగు సమస్యలు :

★ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

★ ప్రతి పిహెచ్‌సిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలి

* అన్ని రకాల మందులు, పరీక్షా పరికరాలు అందుబాటులో ఉంచాలి

★ ప్రజలకు ఉచితంగా, నాణ్యమైన విద్యా, వైద్య సేవలు అందించాలి




ఈ నెల 27న జరిగే కలెక్టరేట్ ధర్నాలో ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళలు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మల్లు నాగార్జున రెడ్డి కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు, నాగారపు పాండు, మట్టి పెల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధిని అడ్డుకున్న వారికి..మాట్లాడే హక్కు లేదు

- 10 ఏళ్లలో బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యం.
- ఫ్లై ఓవర్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి
- అప్పుడు అడ్డుకున్నది కొత్త ప్రభాకర్ రెడ్డి, పద్మాదేవేందర్ రెడ్డి లు
- బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు



**రామాయంపేట జూలై 14 (సిరి న్యూస్)**

భారతీయ జనతా పార్టీ రామాయంపేట పట్టణ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాయంపేట జాతీయ రహదారి–44పై ఆద్య హోటల్ సమీపంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి అప్పటికే జాతీయ రహదారుల శాఖ అధికారులు సానుకూలంగా ఉన్నప్పటికీ, అప్పటి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి తమ అనుచరుల భూముల ప్రయోజనాల కోసం ఆ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు అదే నాయకులు వై–జంక్షన్ అంశంపై రాజకీయాలు చేయడం ప్రజలను మోసం చేయడమేనని, ఇది అత్యంత సిగ్గుచేటైన చర్య అని మండిపడ్డారు.రామాయంపేటలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల విషయాన్ని ఎంపీ ఎం. రఘునందన్ రావు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారని, ఆద్య హోటల్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారని తెలిపారు. త్వరలోనే అక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభమవుతుందని ఎంపీ హామీ ఇచ్చారని వెల్లడించారు.ఉమ్మడి రామాయంపేట మండలంలోని సహకార సంఘాల్లో జరిగిన భారీ అవినీతిని ప్రస్తావిస్తూ, కోనాపూర్ సహకార సంఘంలో కోట్ల రూపాయల కుంభకోణం జరిగినప్పటికీ, విచారణ అనంతరం సుమారు రూ.2 కోట్ల రికవరీకి ఆదేశాలు వచ్చినా కోర్టు స్టే పేరుతో రైతుల డబ్బులను తిరిగి చెల్లించకుండా అడ్డుకోవడం దుర్మార్గమని విమర్శించారు. రైతుల సొమ్మును వెంటనే రికవరీ చేసి వారికి అందించాలని డిమాండ్ చేశారు.రామాయంపేట మున్సిపాలిటీలో జరిగిన రూ.1.60 కోట్ల కుంభకోణంపై బీజేపీ మొదటి నుంచే ధర్నాలు, నిరసనలు చేపట్టి కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు చర్యలు లేకపోవడం విచారకరమని అన్నారు. వెంటనే బాధ్యులపై కేసులు నమోదు చేసి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన, అనంతరం కాంగ్రెస్ పాలనలో రామాయంపేట పట్టణం, మండలం పూర్తిగా అభివృద్ధికి దూరమైందని విమర్శించారు. 15 సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేసిన పద్మా దేవేందర్ రెడ్డి ఒక్కసారి లక్ష్మాపూర్–దంతపల్లి రోడ్డుపై ప్రయాణిస్తే ప్రజలు పడుతున్న కష్టాలు అర్థమవుతాయని, గుంతలమయంగా మారిన ఆ రోడ్డును వెంటనే రెండు లేన్ల బీటీ రోడ్డుగా మంజూరు చేయాలని, స్థానిక ఎమ్మెల్యే రోహిత్ రావు కూడా ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల ప్రాణాలతో, రైతుల సొమ్ముతో, ప్రజాధనంతో చెలగాటమాడిన వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, బీజేపీ ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తుందని రాగి రాములు స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో బీజేపీ కౌన్సిలర్ శంకర్ గౌడ్, మాజీ పట్టణ అధ్యక్షుడు భానుచందర్, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య, యాదగిరి, పట్టణ సీనియర్ నాయకులు పబ్బ సత్యనారాయణ, అక్కన్నపేట మాజీ సర్పంచ్ సిద్ధ రాములు, యువమోర్చా నాయకులు సంతోష్, నాగరాజు, నితిన్ బాసం, అనిల్ కోమటిపల్లి, దయాకర్, మాజీ మండల అధ్యక్షుడు దయానంద్ రెడ్డి, లింగాపూర్ యేసు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మల్కాపూర్ పెద్ద చెరువు వద్ద హెచ్చరిక బోర్డులు




**కొండాపూర్,(సిరి న్యూస్ )జూలై 14:**

వర్షాకాలంలో చెరువుల వద్ద ప్రమాదాలను నివారించేందుకు కొండాపూర్ పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మంగళవారం మండల పరిధిలోని మల్కాపూర్ పెద్ద చెరువు వద్ద హెచ్చరిక (వార్నింగ్) సైన్‌బోర్డులను ఏర్పాటు చేశారు. ఇటీవల చెరువులో ఇద్దరు విద్యార్థులు మునిగి మృతిచెందిన విషాద ఘటన నేపథ్యంలో సీఐ సుమన్‌కుమార్, ఎస్ఐ సోమేశ్వరి ప్రత్యేక చొరవతో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.చెరువు పరిసర ప్రాంతాలకు వచ్చే ప్రజలు, ముఖ్యంగా యువత, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా, ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

# పంచాయతీ కార్యదర్శుల సమావేశం..





- నీటి సమస్య, పారిశుద్ధ్యం, ఇందిరమ్మ ఇళ్లపై అధికారుల కీలక ఆదేశాలు..

**హత్నూర, జూలై 14,(సిరి న్యూస్)**

హత్నూర మండల పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా పంచాయతీ అధికారులు పలు కీలక సూచనలు చేశారు.జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) మల్లారెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. నీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించాలని తెలిపారు.డబుల్ బెడ్రూం/ఇందిరమ్మ ఇళ్లు మంజూరై నిర్మాణం ప్రారంభించని లేదా నిర్లక్ష్యం చేస్తున్న లబ్ధిదారుల వివరాలను పరిశీలించి, అవసరమైతే వారి మంజూరులను రద్దు చేసి, నిజంగా ఇళ్లు నిర్మించేందుకు సిద్ధంగా ఉన్న అర్హులైన లబ్ధిదారులకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సమావేశంలో అంగన్వాడి కేంద్రాలు, వెటర్నరీ ఆసుపత్రులకు సంబంధించిన గ్రామస్థాయి సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కూడా అధికారులు చర్చించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అధికారి (డీఎల్‌పీఓ) అనిత మాట్లాడుతూ, ప్రతి పంచాయతీ కార్యదర్శి గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సంబంధిత అధికారు పాల్గొన్నారు.

# పెన్ పహాడ్ గ్రామంలో రోడ్డు భద్రత పై పోలీసుల అవగాహన సదస్సు.




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి, జూలై 14 (సిరిన్యూస్):**

పెన్‌పహాడ్ గ్రామ పరిధిలో పెన్‌పహాడ్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పెన్‌పహాడ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. వాహనదారులు ప్రయాణాల్లో ఈ క్రింది జాగ్రత్తలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

**హెల్మెట్ ధారణ:**

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం అత్యంత ప్రమాదకరమని, బైక్ నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు.

# గాజుల రామరం, జగద్గిరిగుట్ట, చింతల్ డివిజన్ల సర్ ముఖ్య సమావేశం ఘనంగా నిర్వహణ

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 14, (సిరి న్యూస్) :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గాజులరామారంలోని అన్నపూర్ణమ్మ దేవాలయంలో గాజుల రామారం, జగద్గిరిగుట్ట, చింతల్ డివిజన్ల ఆధ్వర్యంలో మంగళవారం సర్ ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రావుల శేషగిరి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షులు ఎస్. మల్లారెడ్డి, సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఇన్‌చార్జి నందనం దివాకర్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు జెకె శేఖర్ యాదవ్, సర్ కన్వీనర్ శివాజీ, పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా నియమితులైన జెకె శేఖర్ యాదవ్ ని గాజుల రామరం డివిజన్ అధ్యక్షులు సాయినాథ్ నేత, శ్రీనివాసరావు, మహిళా నాయకురాళ్లు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జెకె శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, జిల్లాలోని ఓబీసీ నాయకులు రాజకీయంగా ఎదగడానికి తన వంతు కృషి చేస్తానని, భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, సతీష్, మధు, శారద, పద్మ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేద ప్రజలకు పెన్నిధి

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్:

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 14,(సిరి న్యూస్) :**

జగద్గిరిగుట్ట డివిజన్‌లో నివాసముంటున్న పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఈ. ఉమామహేష్ అన్నారు. జగద్గిరినగర్‌కు చెందిన కావలి బాబు సతీమణి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి చికిత్స పొందుతున్న నేపథ్యంలో వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షల సీఎం సహాయనిధి ఎల్ఓసీ ను సిపిఐ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో మంజూరు చేయించి, మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఈ. ఉమామహేష్ మాట్లాడుతూ, సిపిఐ పార్టీ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట డివిజన్‌లో అనేక మంది పేదలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించామని చెప్పారు. ఈ సహాయం ద్వారా లబ్ధి పొందిన ప్రజలు సిపిఐ పార్టీకి కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు కూడా సిపిఐ చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాలకు ఆకర్షితులై, సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి డి. రాములు, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, యువజన సంఘం కార్యదర్శి వెంకటేష్, శాఖ నాయకులు చంద్రయ్య, కరుణాకర్, బాలకృష్ణ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ డివిజన్ లో సెంట్రింగ్ కార్మికులకు ఐడెంటిటీ కార్డుల పంపిణీ:




**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 14, (సిరి న్యూస్) :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కుత్బుల్లాపూర్ డివిజన్‌లో హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆదేశాల మేరకు, ఆశ్రయ్ సచ్చ అంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జై భవాని సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో అధ్యక్షులు కుంట వేణు ఆధ్వర్యంలో కార్మికులకు ఐడెంటిటీ కార్డులు తయారు చేసి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ ఐడెంటిటీ కార్డు కలిగిన కార్మికుడు ప్రమాదవశాత్తు మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యానికి గురైనా, వారి కుటుంబానికి రూ.20 లక్షల బీమా (ఇన్సూరెన్స్) సౌకర్యం అందజేయబడుతుందని తెలిపారు. అలాగే కార్డు కలిగిన కుటుంబంలో ఆడపిల్ల జన్మిస్తే రూ.30 వేల ఆర్థిక సహాయం అందించే ప్రయోజనం కూడా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కుంట సిద్ధిరాములు, బచ్చ జ్ఞానేశ్వర్, పోగు సమ్మన్న నేత తదితరులు పాల్గొన్నారు.

# శంభీపూర్‌లో సర్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలించిన కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జులై 14, (సిరి న్యూస్) :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 296వ డివిజన్ దుండిగల్ పరిధిలోని శంభీపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) హెల్ప్ డెస్క్ కార్యక్రమాన్ని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజలు ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు తాగునీటి సమస్య, గ్రామ చెరువు ఆక్రమణలపై స్పందించిన కొలన్ హన్మంత్ రెడ్డి చెరువు ప్రాంతాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, ఆక్రమణలను తొలగించి చెరువును పరిరక్షించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం రెండు బోర్‌వెల్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి, దుండిగల్ డివిజన్ అధ్యక్షుడు జక్కుల మల్లేష్, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, పీసరి మహేందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి, సంగొల్ల నాగేష్, క్యాసారం సత్తయ్య, సంగొల్ల శంకర్, మనోహర్, గురువా రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా వినాయక ఆగ్రో ఏజెన్సీస్

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జూలై 14,(సిరి న్యూస్)**

విత్తన, ఎరువుల మరియు పురుగుమందుల డీలర్లు సూచించబడిన చట్టాలకు లోబడి విక్రయాలు జరుపుకోవాల్సి ఉండగా..జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని వినాయక ఆగ్రో ఏజెన్సీస్ డీలర్ ఇరుపాల రాజేశ్వర్ రావు నిబంధనలకు విరుద్ధంగా ఫర్టిలైజర్ షాప్ ను నడుపుతుండడంతో..రైతుల ఫిర్యాదు మేరకు భూపాలపల్లి ఏడిఏ ఎస్ రమేష్ నేతృత్వంలో వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ఎరువుల లభ్యత, నిల్వలు, లైసెన్స్ వివరాలు, కొనుగోలు రసీదులు, అమ్మకపు బిల్లులు, స్టాక్ రిజిస్టర్లు, స్టాక్ ధరల పట్టిక మొదలగునవి పరిశీలించారు. స్థానిక విచారణ ద్వారా సంబంధిత ఎరువుల డీలర్ ఇరుపాల రాజేశ్వర్ రావు ఎరువుల చట్టాలకు విరుద్ధంగా విక్రయాలను నిర్వహిస్తున్నట్టు నిర్ధారణ కావడం జరిగిందని ఏడిఏ ఎస్ రమేష్ తెలిపారు.

# మీరు హెల్దీగానే ఉన్నారా? ఇలా తెలుసుకోండి?





మనం అన్ని విధాలా ఆరోగ్యంగానే ఉన్నామా? లేదా? ఏదైనా సమస్య ఉందా? అన్న విషయం మనం కొన్ని అంశాల ఆధారంగా తెలుసుకోవచ్చు. మనకు తీవ్ర అనారోగ్యం కలిగినప్పుడు మాత్రమే కొన్ని రకాల పరీక్షలు చేయించుకుంటూ ఉంటాం. అప్పుడే మనకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయం తెలుస్తూ ఉంటుంది. అయితే మన శరీరంలో జరిగే కొన్ని మార్పుల ఆధారంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం తెలుసుకోవచ్చు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

### జీర్ణవ్యవస్థ


మన ఆరోగ్యం విషయంలో జీర్ణ వ్యవస్థ ఎంతో కీలకం. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాలేదంటే మనకు ఏదో జీర్ణ సంబంధిత వ్యాధి ఉన్నట్టు పరిగణించాలి. తిన్న తర్వాత గ్యాస్ పట్టినట్టు అనిపిస్తుంటే కచ్చితంగా జీర్ణ వ్యవస్థలో ఏదో ఇబ్బంది ఉన్నట్టే గుర్తించాలి. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయితేనే మన శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.



### తగినంత నిద్ర

మనకు సరిగ్గా నిద్ర పట్టడం లేదంటే.. మనం డేంజర్ లో ఉన్నట్టే.. కాబట్టి కచ్చితంగా ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతోపాటూ నిద్ర రాకపోయినా సమస్యగానే పరిగణించాలి. ఆరోగ్యంగా ఉన్నవారు మంచి నిద్రను పొందుతారు. రాత్రి నిద్ర తర్వాత రిఫ్రెష్, విశ్రాంతిని పొందుతారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. శరీరానికి మంచి నాణ్యమైన నిద్ర లభిస్తే.. అది మంచి శారీరక, మానసిక ఆరోగ్యానికి సంకేతంగా పరిగణించబడుతుంది.





### సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు

మూత్రవిసర్జన వలె, ప్రేగు కదలికలపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. సాధారణ, సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు మెరుగైన జీర్ణక్రియకు సంకేతంగా పరిగణించబడతాయి. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ప్రేగు కదలికలను కలిగి ఉండటం సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మలం విసర్జించడంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, మలవిసర్జన తర్వాత ఖాళీగా అనిపిస్తే అది మంచి ఆరోగ్యానికి సంకేతం.

### మూత్రం రంగు

మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం మన మల, మూత్రాల రంగును చూస్తే అర్థమవుతుంది. ఉన్నామో లేదో తెలుసుకోవడానికి.. మలం, మూత్రంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. లేత పసుపు మూత్రం సాధారణంగా మీరు బాగా హైడ్రేట్ గా ఉన్నారని సూచిస్తుంది. ఇది కిడ్నీ రికవరీకి సంకేతంగా కూడా పరిగణించబడుతుంది. మూత్రం గట్టిపడటం లేదా రంగులో మార్పు కనిపిస్తే, జాగ్రత్తగా ఉండాలి.



### బరువును నియంత్రించడం:

అనేక రకాల వ్యాధులను నివారించడానికి బరువును అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. మీ శరీర ఎత్తును బట్టి మీ బరువు సరిగ్గా ఉంటే అది మంచి ఆరోగ్యానికి సంకేతం. మీ బరువు తక్కువ సమయంలో వేగంగా పెరుగుతూ లేదా తగ్గుతూ ఉంటే, జాగ్రత్తగా ఉండాలి. బరువు అసమతుల్యత అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది.





### మంచి మానసిక ఆరోగ్యం:

శారీరక ఆరోగ్యంలాగే, మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీరు తక్కువ ఒత్తిడికి లోనవుతుంటే, మీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చిరాకు, భయం వంటి సమస్యలు ఉండవు. అది మంచి మానసిక ఆరోగ్యానికి సంకేతం. శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఒకదానికొకటి సంపూర్ణంగా ఉంటాయని ఇక్కడ గమనించడం ముఖ్యం. వీటిలో ఏదైనా ఒకదానిలో ఆటంకం మొత్తం శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.



### గాయాలను త్వరగా నయం చేయడం

శరీరంపై గాయం లేదా గాయం ఎంత త్వరగా నయం అవుతుందనే దాని ఆధారంగా కూడా ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. గాయాలు త్వరగా మానితే మన రోగనిరోధక వ్యవస్థ బాగానే ఉందనడానికి సంకేతం. మధుమేహం వంటి వ్యాధులలో రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది. వీటితో పాటు మనం తరుచూ అనారోగ్యానికి గురవుతున్నామంటే కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించి అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

# ఉలవలతో ఇన్ని లాభాలా?




ఉలవచారు, ఉలవచారు బిర్యాని ఇప్పుడు ఎంతో ఫేమస్. అయితే ఉలవలతో అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వీటితో ఇప్పుడు రకరకాల వంటలు చేస్తున్నారు. భారత దేశంలోని ఉష్ణమండల వాతావరణాల్లో ఈ ఉలవలు పెరుగుతాయి. వీటిలో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఉలవలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎర్రటి, గోధుమ రంగు పప్పధాన్యాలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని శతాబ్దాలుగా సాంప్రదాయ వైద్యంలో వివిధ రకాల రోగాలకు చికిత్స చేయడానికి ఉపయోగించబడుతున్నాయి.

### ప్రోటీన్ పుష్కలంగా..

ఉలవల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు, మరమ్మతుగా ప్రొటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. శాకాహారులకు ప్రొటీన్ అందజేసే ఆహారాల్లో ఉలవలు కూడా ఎంతో కీలకం. ఇక ఉలవల్లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ను నిర్వహించడంలో ఫైబర్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పోషకాలు అధికంగా ఉండే ఉలవల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు నిర్వహణ, మొత్తం ఆరోగ్యానికి గొప్ప ఆహారంగా మారుతుంది. ఉలవల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్ఆనయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయని అధ్యయనాలు నిరూపించాయి.

### గుండె ఆరోగ్యం పదిలం

ఉలవలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దాని అధిక ఫైబర్ కంటెంట్, యాంటీఆక్సిడెంట్ లక్షణాల కారణంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉలువలలో ఉండే ఐరన్, మెగ్నీషియం, విటమిన్ సీ వంటి విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.





# కాకరతో ఇన్ని ప్రయోజనాలా? తెలిస్తే అస్సలు వదలరు..!

కాకరకాయ ఈ కూరగాయ పేరు చెప్పగానే చాలా మంది నిట్టూరుస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కాకరను తప్పదన్నట్టు తింటుంటారు. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు కాకరకాయ ఓ సంజీవని లాంటిది. చక్కెర స్థాయిలను కాకర కంట్రోల్ లో చేస్తోంది. బరువు తగ్గడంలోనూ తోడ్పడుతుంది. జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది.

### కాకరరసంతో లాభాలు ఇవే..!

కాకరకాయ జ్యూస్ తరుచూ తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులకు దూరం కావొచ్చట. జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడంలో కాకర కాయ రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుత కాలంలో ప్రతి నలుగురిలో ఒకరు జీర్ణ సంబంధిత సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాకర కాయ రసాన్ని ఖాళీ కడుపుతో తాడగం వల్ల శరీరంలోని సమస్యలు తొలగిపోయి జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

### బరువు నియంత్రణ:

పెరిగిన బరువుతో చాలా మంది ఆందోళన చెందుతున్నాయి. అలాంటి వారు కాకర కాయ రసం తాగితే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండే కాకర కాయ రసం బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా కాకర రసం తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి ఎంతో సహాయపడుతుంది.

### ఇమ్యూనిటీ బూస్టర్.. !

ప్రస్తుత వర్షా కాలంలో జనం అనేక రోగాల బారిన పడుతున్నారు. సరైన ఇమ్యూనిటీ లేకపోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే కాకర రసం తరుచూ తీసుకోవడం.. లేదంటే కాకరకాయలను కూర చేసుకొని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని వైద్య నిపుణలు సూచిస్తున్నారు. కాకరకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

### చర్మానికి మేలు:

కాకర కాయ రసం చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. కాకర కాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి . ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి కాంతివంతగా చేస్తాయి. కాకర కాయ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల చర్మానికి కొత్త మెరుపు వస్తుంది. అంతే కాకుండా దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.